EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

శనివారం

08 జూన్ 2024

పేజీలు: 02






రామోజీ రావు భౌతికకాయానికి నివాళులు అర్పించిన 'సూర్య' దినపత్రిక అధినేత నూకారపు సూర్య ప్రకాశ రావు



ఈనాడు సంస్థల అధినేత

# రామోజీరావు ఇకలేరు



## రేపు ఉదయం రామోజీ గారి ఫిలిం సిటీలోనే 9 నుంచి 11 గంటలకు అంత్యక్రియలు

మన తెలుగు నేల ప్రముఖ వ్యాపార వేత్త, ఈటీవీ ఛానెల్ అధినేత, ప్రముఖ నిర్మాత అలాగే ఈనాడు దినపత్రిక సృష్టికర్త గా దిగ్గజం రామోజీరావు గారు ఎలాంటి ముద్ర వేశారో అందరికీ తెలిసిందే. రంగం ఏదైనా సరే బెస్ట్ క్వాలిటీ కంటెంట్ మాత్రమే ఇవ్వడం ఆయన ఆనవాయితీగా పెట్టుకొని ఎన్నో మన్ననలు పొందారు. అలా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహా టెలివిజన్ రంగంలో కూడా ఒక కొత్త ఒరవడి సృష్టించారు. కానీ ఇప్పుడు ఆయన ఇకలేరు అనే విషాద వార్త తెలుగు ప్రజల్లో టెలివిజన్ రంగం సహా సినీ వర్గాల్లో విషాద ఛాయలు తీసుకొచ్చింది. నిన్న రాత్రి సమయంలో ఆయన అస్వస్థతకు లోనయ్యారు. అలా నానక్ రామ్ గూడ స్టార్ హాస్పిటల్ లో చేర్చగా వెంటిలేటర్ పై చికిత్స అందించే ప్రయత్నం వైద్యులు చేశారు. అయితే హై బీపీ సహా శ్వాస అందుకోవడంలో ఇబ్బంది నెలకొనడంతో ఆయన తన 4 గంటల 50 నిమిషాల సమయంలో తన 88వ ఏట తుది శ్వాస విడిచారు. దీనితో తీవ్ర విషాదం ఇప్పుడు నెలకొంది. రామోజీ రావు గారు కృష్ణ జిల్లా పెదపారుపూడి గ్రామంలో 1936లో సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. అక్కడ నుంచి తన స్వశక్తితో ఎదిగి ప్రపంచంలోనే అతి పెద్ద థీమ్ పార్క్ ఫిల్మ్ స్టూడియో కట్టించారు. ఈనాడు ఛానెల్, పేపర్ తో పాన్ ఇండియా వైడ్ గా వ్యాపించారు. మార్గదర్శి చిట్ ఫండ్స్, ప్రియా పచ్చళ్ళు, ఉషా కిరణ్ మూవీస్ బ్యానర్ పై మంచి సినిమాలు కూడా అందించారు. ఇలా వారు టచ్ చేయని రంగం లేదు. మరి వారికి చెరుకూరి సుమన్, కిరణ్ ప్రభాకర్ ఇద్దరు సంతానం కాగా వారిలో అపారమైన టాలెంట్ కలిగిన సుమన్ కొన్నాళ్ళ కితమే అనారోగ్యంతో కన్ను మూసారు. ఇలా ఎన్నో ఆటు పోట్లు చూసిన వారు అనేక అవార్డులు కూడా అందుకున్నారు. 5 నంది అవార్డులు, 4 ఫిల్మ్ ఫేర్ అవార్డులు అలాగే ఒక నేషనల్ అవార్డ్ సహా 2016 లో భారతదేశ రెండో అత్యున్నత పురస్కారం పద్మవిభూషన్ కూడా ఆయన అందుకున్నారు. ఆయన జీవితం ఎంతోమందికి ప్రేరణగా నిలిచే పాఠం. ఆయన లేకపోడం అనేది హృదయ విదారకమే. మరి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలి అని మా సూర్య టీం ఆకాంక్షిస్తుంది. ఓంశాంతి.



## రామోజీరావు స్వగ్రామంలో విషాదఛాయలు

రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు మరణంతో కృష్ణా జిల్లా పామర్రు మండలంలోని ఆయన స్వగ్రామం పెదపారుపూడిలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన మరణ వార్త విని గ్రామస్థులు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామ కూడళ్లలో 'జోహార్ రామోజీరావు' అంటూ నినాదాలు చేశారు. రామోజీ ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్థులు ఆయనకు నివాళులర్పించేందుకు హైదరాబాద్ బయలుదేరారు.

**సొంత డబ్బుతో గ్రామానికి సేవ చేశారు: పామర్రు ఎమ్మెల్యే**


రామోజీరావు మరణంపై పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్య విజయాలు సాధించిన ఆయన మృతి తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. రామోజీరావు తెలుగు రాష్ట్రాలు, దేశానికి ఎన్నో సేవలు అందించారన్నారు. తెలుగు వారి జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్ర వేసిన ఆయన.. తెలుగు ప్రజల ఆస్తి అని కొనియాడారు. రామోజీరావు మరణం తెలుగు ప్రజలకే కాకుండా దేశానికి కూడా తీరని లోటు అన్నారు. సొంత డబ్బుతో పెదపారుపూడి గ్రామానికి ఎన్నో సేవలు చేశారని, యువతకు ఉపాధి కల్పించే దిశగా కృషి చేశారని చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులకు కుమార్ రాజా ప్రగాఢ సానుభూతి తెలిపారు.







## ఉత్తమ జర్నలిస్టులను అందించిన అక్షర యోధుడు

మీడియా మొఘల్ రామోజీరావు తెలుగు సమాజానికి ఎంతో మంది నిఖార్సైన జర్నలిస్టులను అందించారు. 'ఈనాడు జర్నలిజం స్కూల్' ద్వారా వేలాది జర్నలిస్టులకు శిక్షణ ఇచ్చారు. ఇప్పుడున్న టీవీ ఛానల్స్, పత్రికల్లో పనిచేసే ఎడిటర్లు, రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టుల్లో ఎక్కువ శాతం మంది ఈజేఎస్‌లో ట్రైనింగ్ పొందినవాళ్లే. ఇక్కడ శిక్షణ పొందారంటే క్రమశిక్షణ, ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం లక్షణాలు అలవడుతాయని ప్రతీతి.



అప్పట్లో రామోజీరావు గారు

## రామోజీ సక్సెస్‌లో ఈటీవీ 9పీఎం న్యూస్ ఒకటి




రామోజీరావు కెరీర్ సక్సెస్‌లో ఈటీవీ 9పీఎం న్యూస్ ఒకటి. రోజంతా జరిగిన ముఖ్యమైన విషయాలను 30 నిమిషాల్లో తెలిపే ఈ బులిటెన్ కోసం ప్రేక్షకులు ఎదురుచూస్తుంటారు. ఇది ఇప్పటికీ హైయెస్ట్ టీఆర్‌పీని కలిగి ఉందనడంలో అతిశయోక్తి లేదు. 1995లో ఈటీవీని రామోజీ ప్రారంభించగా కొద్ది రోజుల్లోనే ప్రజల ఆదరణ పొందింది. దీని తర్వాత ఎన్నో న్యూస్ ఛానల్స్ వచ్చినప్పటికీ ఈటీవీ 9PM న్యూస్ ఎంతో మందికి ఫేవరెట్.

## తెలుగు బతకాలని.. తెలుగీకరించి..

తెలుగు భాష నిత్యమై, నిఖిలమై వెలగాలని ఆకాంక్షించిన వారిలో రామోజీరావు ముందుంటారు. మన భాషలో ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ పదాలను తెలుగీకరించేందుకు ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగానే 'తెలుగు వెలుగు' మాసపత్రికకు శ్రీకారం చుట్టారు. 'ఈనాడు'లోనూ ఆయన పరభాష పదాల నియంత్రణకు కృషి చేశారు. ప్రతి పదాన్నీ తెలుగీకరించే క్రమంలో విమర్శలు సైతం ఎదుర్కొన్నారు. అయినా పట్టించుకోకుండా తెలుగుపై అభిమానాన్ని మాత్రం చంపుకోలేదాయన.

## తన పేరు తానే పెట్టుకున్న రామోజీ

మీడియా టైకూన్ రామోజీరావు అసలు పేరు అది కాదు. తల్లిదండ్రులు వెంకటసుబ్బారావు-సుబ్బమ్మ ఆయనకు 'రామయ్య' అని పేరు పెట్టారు. కానీ బడిలో టీచర్లకు తన పేరును రామోజీరావుగా చెప్పుకున్నారు. దీంతో అప్పటి నుంచి ఆయన పేరు అలాగే స్థిరపడిపోయింది. మీడియా సంస్థల అధిపతిగా, దిగ్గజ వ్యాపారవేత్తగా రామోజీ రావు అంటే పేరు కాదు ఒక బ్రాండ్ అనేంతలా ఆయన ఎదిగిపోయారు.

## రామోజీరావు నిర్మించిన సినిమాలు

శ్రీవారికి ప్రేమలేఖ(1984), మయూరి(1985), మౌన పోరాటం(1989), ప్రతిఘటన(1987), పీపుల్స్ ఎన్‌కౌంటర్(1991), అశ్వని(1991), మెకానిక్ మామయ్య(1999), మూడుముక్కలాట (2000), చిత్రం, నువ్వే కావాలి(2000), ఇష్టం(2001), ఆనందం (2001), ఆకాశ వీధిలో(2001), నిన్ను చూడాలని(2001), తుఝె మేరీ కసమ్, వీధి(2005), నచ్చావులే(2008), నిన్ను కలిశాక(2009), దాగుడుమూత దండాకోర్(2015) వంటి 87 సినిమాలను రామోజీరావు నిర్మించారు.



## రేపు సినిమా షూటింగ్‌లకు సెలవు

రామోజీరావు మృతి పట్ల తెలుగు ఫిల్మ్ ఛాంబర్ సంతాపం వ్యక్తం చేసింది. సంతాప సూచికగా రేపు సినిమా షూటింగ్‌లకు సెలవు ప్రకటించినట్లు ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్ తెలిపారు. రేపు ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో రామోజీరావు అంత్యక్రియలు జరగనున్నాయి. ఆర్ఎఫ్‌సీలో ఆయన పార్థివదేహానికి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు నివాళులర్పిస్తున్నారు.

## మరో 2 నెలల్లో 'ఈనాడు'కు 50 ఏళ్లు.. అంతలోనే..

రామోజీరావు మానస పుత్రిక 'ఈనాడు' ప్రారంభించి ఈఏడాది ఆగస్టు 10 నాటికి 50 ఏళ్లు పూర్తవుతాయి. 1974లో ఈనాడు ప్రస్థానాన్ని ప్రారంభించిన రామోజీరావు ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ, ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ సంచలనం సృష్టించారు. నిత్యం తె.జా 3-4 గంటల మధ్య ఈనాడు పేపర్ చదవడం ఆయనకు అలవాటు. మరో 2 నెలల్లో ఆ పేపర్‌కు 50 ఏళ్లు నిండనుండగా ఈ అరుదైన ఘట్టాన్ని చూడకుండానే రామోజీరావు కన్నుమూయడం విషాదకరం.

## చివరి కోరిక తీరకుండానే.. అస్తమించిన రామోజీ

సామాన్య రైతు కుటుంబంలో పుట్టి ఎంతోమందికి సాధ్యం కాని విజయాలను అందుకున్న రామోజీ రావుకు ఒక కోరిక మాత్రం తీరలేదు. తన నిర్మాణ సంస్థ 'ఉషా కిరణ్ మూవీస్' బ్యానర్‌లో 100 సినిమాలు తెరకెక్కించాలనేది ఆయన కోరిక. అయితే ఇప్పటికి ఆ బ్యానర్‌లో సుమారు 90 సినిమాలు పూర్తయ్యాయి. 1978లో వచ్చిన 'మార్పు' అనే సినిమాలో రామోజీ నటించడం కొసమెరుపు.







## ఈనాడు నుంచి ఈటీవీ విన్ వరకు..

# రామోజీ ప్రస్థానం

ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు (88) శనివారం ఉదయం కన్నుమూశారు. ఇక రామోజీ రావు మృతితో మీడియా రంగంతో పాటు సినీ రంగం శోకసంద్రంలో మునిగిపోయింది. ఇక రామోజీరావు కెరీర్‌లో కీలక మలుపు అంటే ఈనాడు పత్రికను మొదలుపెట్టడమే.వైజాగ్ వేదికగా 1974లో ఈనాడు పత్రికను ప్రారంభించిన ఆయన దాని ద్వారా కొన్ని వేలమంది పాత్రికేయులను తయారు చేశారు. దీని తర్వాత 1995 ఆగస్టులో తెలుగు ప్రేక్షకుల కోసం ఈటీవీని ప్రారంభించారు. తక్కువ సమయంలోనే ఈ ఛానల్ అభిమానులు మనసులను దోచుకుంది. ఇక ఈటీవీలో వచ్చే రాత్రి 9 గంటల వార్తలకు అయితే ఇప్పుడు కూడా జనాలు ఆసక్తిగా చూస్తారు. మరోవైపు సినీ రంగంలో కూడా రామోజీ రావు విశేష కృషి చేశారు. తన సొంత నిర్మాణ సంస్థ ఉషాకిరణ్ మూవీస్ బ్యానర్‌పై ఇప్పటివరకు వివిధ భాషల్లో 87 సినిమాలు నిర్మించారు. ఈ బ్యానర్‌తోనే టాలీవుడ్ నటులు ఎన్టీఆర్, కల్యాణ్ రామ్, దర్శక దిగ్గజం రాజమౌళి తదితరులు సినిమా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఇక ఉషాకిరణ్ మూవీస్ బ్యానర్‌లో చివరిగా 2015లో రాజేంద్రప్రసాద్ నటించిన దాగుడుమూత దండాకోర్ సినిమా వచ్చింది. కేవలం పెద్ద తెరకు మాత్రమే పరిమితం కాకుండా బుల్లితెరపై తన సత్తా చూపించారు. భాగవతం, అన్వేషిత, ఎండమావులు, ఆడపిల్ల, పంచతంత్రం లాంటి బ్లాక్ బస్టర్ ధారావాహికలను అందించారు. కాలంతో పాటు మారుతూ.. రీసెంట్‌గా ఓటీటీలో కూడా ఎంట్రీ ఇచ్చారు రామోజీ రావు. ఈనాడు గ్రూప్ నుంచి వచ్చిన ఓటీటీ వేదిక ఈటీవీ విన్. కేవలం తెలుగు సినిమాలతో పాటు తెలుగు ధారావాహికలు, ప్రోగ్రామ్స్ ఈ ఓటీటీలో ప్రసారం అవుతుంటాయి.



## రామోజీరావు వ్యక్తి కాదు.. శక్తిమంతమైన వ్యవస్థ: వెంకయ్యనాయుడు

రామోజీరావు స్వయంకృషితో కష్టపడి అనేక రంగాల్లో విజయం సాధించారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు. రామోజీ పార్థివదేహానికి వెంకయ్యనాయుడు నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. "ఒక అఖండ తెలుగు జ్యోతి ఆరిపోయింది. ఒక ధ్రువతారలా నిరంతరం వెలుగుతూ ఉంటారు. ఆయన చేపట్టిన కార్యక్రమాలు భవిష్యత్తు తరాలకు ఆదర్శం. రామోజీరావు ఒక పోరాట యోధుడు" అని వెంకయ్యనాయుడు కొనియాడారు.

02 EVENING EDITION
శనివారం | 08 జూన్ 2024 4 PM
www.suryaa.com
సూర్య www.suryaa.com
EVENING EDITION 4 PM

# రామోజీరావు అరుదైన ఫోటోలు



# రామోజీరావుకు సినీ ప్రముఖుల నివాళి

**గేమ్ ఛేంజర్ చిత్రీకరణలో రామోజీ రావు గారికి అశ్రు నివాళ్లు అర్పించిన రామ్ చరణ్ - దర్శకుడు శంకర్**



పత్రికా రంగంలో చెరగని ముద్ర వేసిన ఈనాడు సంస్థల అధినేత, దిగ్గజ పాత్రికేయులు రామోజీరావు గారి మరణం అత్యంత బాధాకరం. ఈ రోజు రాజమండ్రిలో గేమ్ ఛేంజర్ చిత్రీకరణ చేస్తున్న రామ్ చరణ్... రామోజీ రావు గారికి అశ్రు నివాళులు అర్పించారు. ఆయనతో పాటు దర్శకులు శంకర్, నటులు సునీల్ రఘు కారుమంచి ఇతర చిత్ర బృంద సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. రామోజీరావు గారి మరణం తెలుగు ప్రజలకు తీరని లోటు అని తెలిపారు.



**రామోజీకి 'భారతరత్న' ఇవ్వడమే అసలైన నివాళి - రాజమౌళి**

స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్.రాజమౌళి, ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం.కీరవాణి రామోజీ పార్థివదేహానికి తమ అశ్రు నివాళి అర్పించారు. ఈ సంర్భంగా మీడియాతో మాట్లాడిన రాజమౌళి.."ఏ రంగంలో అయినా తనకంటూ ఓ ప్రత్యేక ముద్రను వేసుకుని, గెలుపు తలుపులు తట్టిన మహనీయుడు రామోజీ రావు.. ఎన్నో సంస్థలను నెలకొల్పి, సరికొత్త ఆలోచనలతో వాటిని శిఖరాలకు తీసుకెళ్లిన ఒకే ఒక వ్యక్తి రామోజీ రావు.. ఆయనకు భారతరత్న ను అందించడమే మనం ఇవ్వగలిగే అసలైన నివాళి.." అంటూ పేర్కొన్నారు. రామోజీ రావు మృతి పట్ల రాజమౌళి తీవ్ర భాగోద్వానికి లోనయ్యారు. ఆయన ఎంతో మందికి ఉపాధి కల్పించి.. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని రాజమౌళి చెప్పకొచ్చారు.

**రామోజీ మరణం బాధాకరం: మోదీ**

భారతీయ మీడియాలో విప్లవాత్మక మార్పు తెచ్చిన దార్శనికుడు రామోజీ రావు మరణం బాధాకరమని ప్రధాని మోదీ అన్నారు. 'భారతదేశ అభివృద్ధి పట్ల రామోజీ చాలా మక్కువ చూపేవారు. ఆయనతో మాట్లాడి కొంత జ్ఞానం పొందే అవకాశం చాలాసార్లు లభించడం నా అదృష్టం. ఈ క్లిష్ట సమయంలో రామోజీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, అసంఖ్యాక అభిమానులకు సానుభూతి' అని Xలో నివాళులర్పించారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ సంతాపం ప్రకటించారు.

**మీడియా, వినోద రంగం ఓ దిగ్గజాన్ని కోల్పోయింది: ముర్ము**

రామోజీరావుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నివాళులర్పించారు. 'భారత మీడియా, వినోద రంగం రామోజీలాంటి దిగ్గజాన్ని కోల్పోయింది. వ్యాపారవేత్త, ఈనాడు వార్తాపత్రిక, ఈటీవీ న్యూస్ నెట్‌వర్క్, రామోజీ ఫిల్మ్ సిటీతో సహా అనేక సంస్థలకు ఆయన మార్గదర్శకుడు. పద్మవిభూషణుడు. ఆయన చేసిన సేవలు చిరకాలం గుర్తుండిపోతాయి. ఆయన కుటుంబసభ్యులకు, శ్రేయోభిలాషులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా' అని Xలో పోస్ట్ చేశారు.

**ప్రజల హృదయాల్లో రామోజీరావు చెరగని ముద్రవేశారు: కిషన్ రెడ్డి**

రామోజీరావు మృతి పట్ల TBJP చీఫ్ జి.కిషన్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 'చిత్తశుద్ధి, అంకితభావంతో కష్టించి పనిచేస్తే ఏదైనా సాధించవచ్చనడానికి రామోజీరావు జీవితం ఒక చక్కటి ఉదాహరణ. తెలుగు ప్రజల హృదయాల్లో ఆయన చెరగని ముద్రవేశారు. జర్నలిజానికి ఓ గొప్ప గుర్తింపును కల్పించారు. ఆయన రాసిన ప్రతి అక్షరం, వేసిన ప్రతి అడుగూ తెలుగుదనమే' అని పేర్కొన్నారు. రామోజీరావు అంత్యక్రియలు రేపు జరగనున్నాయి.

**రామోజీరావు మరణంపై జగన్ ట్వీట్**

మీడియా దిగ్గజం రామోజీరావు మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ సీఎం జగన్ తెలిపారు. తెలుగు పత్రికా రంగానికి దశాబ్దాలుగా ఆయన ఎనలేని సేవలందించారని కొనియాడారు. 'ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. రామోజీరావుగారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని జగన్ ట్వీట్ చేశారు.

**రామోజీ మృతిపై KTR, హరీశ్, షర్మిల సంతాపం**

రామోజీ గ్రూప్స్ అధినేత రామోజీరావు మృతిపై పొలిటికల్ లీడర్లు KTR, హరీశ్, షర్మిల సంతాపం ప్రకటించారు. 'రామోజీ మృతితో బాధపడ్డాను. రామోజీ స్వీయ నిర్మిత వ్యక్తి, ఆయన కథ స్ఫూర్తిదాయకం' అని కేటీఆర్ అన్నారు. 'అనేక రంగాల్లో అద్భుత విజయాలందుకుని, భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచారు' అని షర్మిల.. 'రామోజీరావు తెలుగు వాడి సత్తాను యావత్ ప్రపంచానికి చాటి చెప్పారు' అని హరీశ్ రావు ట్వీట్ చేశారు.

**నన్ను సినీ ఇండస్ట్రీకి పరిచయం చేసింది రామోజీరావే: Jr.NTR**

రామోజీరావు ఇక లేరనే వార్త చాలా బాధాకరమని Jr.NTR ట్వీట్ చేశారు. 'శ్రీ రామోజీరావు గారి లాంటి దార్శనికులు నూటికో కోటికో ఒకరు. ఆయన లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనటువంటిది. "నిన్ను చూడాలని" చిత్రంతో నన్ను తెలుగు సినీ పరిశ్రమకి పరిచయం చేసినప్పటి జ్ఞాపకాలు ఎప్పటికీ మరువలేను. ఆ మహనీయుడి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు.



**రాజకీయాల్లో రామోజీరావు కింగ్ మేకర్: రజనీకాంత్**

తన గురువు, మార్గదర్శకుడు రామోజీరావు మరణం బాధ కలిగించిందన్నారు సూపర్‌స్టార్ రజనీకాంత్. జర్నలిజం, సినిమాల్లో చరిత్ర సృష్టించిన ఆయన రాజకీయాల్లో కింగ్‌మేకర్ అని కొనియాడారు. ఉషాకిరణ్ మూవీస్‌లో పనిచేసిన నాటి నుంచి జబర్దస్త్ వరకు ఆయనతో అనుబంధాన్ని గుర్తు తెచ్చుకుంటున్నట్లు మాజీ మంత్రి రోజా తెలిపారు. ఇక బోయపాటి శ్రీను తదితర సినీ, రాజకీయ ప్రముఖులు రామోజీ మృతికి సంతాపం ప్రకటించారు.



## రేపే మోదీ ప్రమాణ స్వీకారం.. ఢిల్లీ చేరుకున్న బంగ్లాదేశ్ ప్రధాని హసీనా

ఇటీవలే వెలువడిన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ కూటమి హ్యాట్రిక్ కొట్టిన విషయం తెలిసిందే. దీంతో నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు మోదీ ప్రమాణ స్వీకారమహోత్సవం ఉండబోతోంది. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఢిల్లీలోని కర్తవ్యపథ్ వద్ద ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. మరోవైపు ఈ కార్యక్రమానికి పలుదేశాధినేతలను కూడా కేంద్రం ఆహ్వానించింది. ఇందులో భాగంగా కేంద్రం ఆహ్వానం మేరకు బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనా ఇవాళ ఢిల్లీ చేరుకున్నారు. శనివారం మధ్యాహ్నం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయ్యారు. బంగ్లా ప్రధానికి పలువురు అధికారులు స్వాగతం పలికారు. రేపు జరగబోయే మోదీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో హసీనా పాల్గొననున్నారు.



## జగన్ సీఎంవో తీరుపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ కార్యాలయ వ్యవహార తీరుపై వైసీపీ నాయకులు ఒక్కొక్కరూ పెదవి విప్పుతున్నారు. సీఎంవో కార్యాయంలో పనిచేసే అధికారుల ప్రవర్తన వల్ల నియోజకవర్గ సమస్యలను నేరుగా వైఎస్ జగన్‌కు చెప్పకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వైఎస్ జగన్ పాలనలో సీఎంవో తీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గ సమస్యలను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లేందుకు వెళితే సీఎంవో తీరుతో కలిసేందుకు వీలయ్యేది కాదని ఆరోపించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం అనేక ఇబ్బందులు పడ్డారని, గంటల తరబడి ఎదురుచూసే పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. ధర్మవరం రైల్వే ఉపరితల వంతెన నిర్మాణం కోసం భూసేకరణకు అవసరమయ్యే రూ.15 నుంచి రూ.20 కోట్ల మంజూరికి వందసార్లు సీఎం కార్యాలయం చుట్టూ తిరిగి వేసారి పోయానని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని 50 సార్లు ఫైనాన్స్ సెక్రెటరీ చుట్టూ తిరిగినా పనికాలేదని వాపోయారు. ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మడం వల్లే అత్యధిక స్థానాల్లో గెలుపొందారని వెల్లడించారు. వైసీపీ కూడా పెన్షన్‌ను పెంచుతూపోతామని భరోసా ఇచ్చి ఉంటే ఫలితాలు సానుకూలంగా వచ్చి ఉండేవని అన్నారు. ఎన్నికల ఫలితాలు తీవ్ర నిరాశ పరిచాయని పేర్కొన్నారు.

# అతనే పర్‌ఫెక్ట్ మ్యాన్

ఈ ఏడాది మార్చిలో చిరకాల స్నేహితుడు మాథిస్‌బోను పెళ్లాడింది పంజాబీ భామ తాప్సీ. కొద్దిమంది కుటుంబ సన్నిహితుల సమక్షంలో రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో వారి వివాహం జరిగింది. తన పెళ్లి గురించి ఇప్పటివరకు ఎలాంటి విశేషాలను పంచుకోలేదు తాప్సీ. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో వివాహంతో పాటు తన భర్త మాథిస్‌బో గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. కాలేజీ రోజుల నుంచి తాను కొంతమంది అబ్బాయిలతో డేటింగ్ చేశానని, అయితే మాథిస్‌బోలో తాను పర్‌ఫెక్ట్‌మ్యాన్‌ను చూశానని తాప్సీ పేర్కొంది. 'మాది ఒక్కరోజులో చిగురించిన ప్రేమకాదు. ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి చాలా సమయం పట్టింది. మాథిస్‌తో చేసిన ప్రయాణంలో నేను చాలా సెక్యూర్డ్‌గా ఫీలయ్యాను. అతను బ్యాడ్మింటన్ ప్లేయర్ కాబట్టి ఎప్పుడూ పాజిటివ్ దృక్పథంతో కనిపించేవాడు. సవాళ్లను స్వీకరించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే మనస్తత్వం అతనిది. ఈ లక్షణాలు నచ్చే అతన్ని పెళ్లాడాను' అని తాప్సీ చెప్పకొచ్చింది.






## రేపే గ్రూప్1 ప్రిలిమ్స్..

### అభ్యర్థులు ఈ విషయాలు మర్చిపోకండి

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను జూన్ 9న నిర్వహించనుంది.. రేపు ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ పరీక్ష జరగనుంది. అభ్యర్థులు ఉదయం 10 గంటలలోపు ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు తెలిపారు. పది తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించబోమని పేర్కొన్నారు. పది తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించబోమని అధికారులు పేర్కొన్నారు.

- మొత్తం 897 పరీక్ష కేంద్రాల్లో 4.03 లక్షలమంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష రాసే అభ్యర్థులకు కీలక మార్గదర్శకాలను జారీ చేశారు.
- అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు బూట్లు ధరించకుడదు, చప్పల్స్ మాత్రమే వేసుకోవాలి.
- బయోమెట్రిక్ వేలిముద్ర వివరాల రికార్డింగ్ ఉన్న క్రమంలో అభ్యర్థులు తమ వేళ్లపై మెహెందీ లేదా ఏదైనా ఇతర ప్రింటెడ్ రంగులు ఉంచుకోరాదు.
- కాలిక్యులేటర్‌లు, పేజర్‌లు, సెల్‌ఫోన్‌లు, టాబ్లెట్‌లు, పెన్ డ్రైవ్‌లు, బ్లూటూత్ పరికరాలు, గడియారాలు తీసుకురావడం నిషేధం.
- లాగ్ బుక్‌లు, లాగ్ టేబుల్‌లు, వాలెట్‌లు, హ్యాండ్‌బ్యాగ్‌లు, పౌచ్‌లు, రైటింగ్ ప్యాడ్‌లు, నోట్స్, చార్ట్‌లు, లూజ్ షీట్‌లు, ఆభరణాలు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు కూడా తీసుకురావద్దు.
- ఐడీకార్డు, హాల్ టిక్కెట్ తప్పనిసరిగా తెచ్చుకోవాలని, హాల్ టికెట్ ఫోటో సరిగా లేకుంటే మరొక ఫోటో తెచ్చుకోవాలని అధికారులు సూచించారు.
- ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.
- TSPSC గ్రూప్ 1 సర్వీస్‌లోని 563 పోస్టుల భర్తీకి ఈ నోటిఫికేషన్ విడుదలైంది. దీనిలో డిప్యూటీ కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, జిల్లా పంచాయితీ రాజ్ ఆఫీసర్, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ వంటి పోస్టులుంటాయి.



## మోదీకి కంగ్రాట్స్ చెప్పిన మస్క్

లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రధాని మోదీకి అమెరికా టెక్ బిలియనీర్ ఎలన్ మస్క్ కంగ్రాట్స్ తెలిపారు. ఇండియాలో తమ కంపెనీలు పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ఎన్నికల్లో విజయం సాధించిన మోదీకి కంగ్రాట్స్ చెబుతున్నట్లు మస్క్ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. మోదీ మూడవ సారి ప్రధానిగా జూన్ 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. టెస్లా కంపెనీ సీఈవో మస్క్ ఇటీవల ఇండియా టూర్‌ను రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. కొన్ని అనివార్య పరిస్థితుల వల్ల మస్క్ ఆ ట్రిప్ రద్దు చేసుకున్నారు. అయితే రెండు నెలల బ్రేక్ తర్వాత ఇప్పుడు మోదీకి విషెస్ చెబుతూ మస్క్ పోస్టు పెట్టారు. ఏప్రిల్ 21, 22 తేదీల్లో ప్రధాని మోదీని కలవాల్సిన మస్క్.. ఆ పర్యటనను రద్దు చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది మళ్లీ ఇండియాకు రానున్నట్లు అప్పుడు చెప్పారు. గత ఏడాది జూన్‌లో మోదీ అమెరికా వెళ్లిన సమయంలో అక్కడ మస్క్‌ను కలిశారు. 2024లో ఇండియాకు రానున్నట్లు ఆయన చెప్పారు. భారతీయ మార్కెట్లోకి టెస్లా ఎంటర్ అవుతుందని ఆయన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అయితే మస్క్ రానున్న నేపథ్యంలో టెస్లా కంపెనీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ గురించి ప్రకటన చేసే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపించాయి. స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ వ్యాపారాన్ని కూడా విస్తరించే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.